www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 11 జూలై 2023
5
ఏలూరు

## డిపిఒగా శ్రీనివాసవిశ్వనాథ్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పంచాయతీ అధికారిగా టి.శ్రీనివాసవిశ్వనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతివ్వాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాలు వరదల కారణంగా ముంపునకు గురికాకుండా ఉండేందుకు డ్రెయినేజీలో పూడిక తీయించాలని, ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త సేకరణ చేయాలన్నారు. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించి, తడి, పొడి చెత్తను వేరుచేసి, తడి చెత్త ద్వారా కంపోస్ట్ ఎరువు తయారీ, పొడి చెత్తను రీసైక్లింగ్ ద్వారా సంపద సృష్టించాలని సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అభివాదం చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

# కదం తొక్కిన అంగన్వాడీలు

## నినాదాలతో దద్దరిల్లిన కలెక్టరేట్ ప్రాంగణం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమస్యల పరిష్కారం కోసం ప్రతి అంగన్వాడీ కార్యకర్త ఝాన్సీలక్ష్మీబాయ్‌లా పోరాడాలని పలువురు వక్తలు అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు స్థానిక జ్యూట్‌మిల్లు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాకు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు కె.విజయలక్ష్మి అధ్యక్షత వహించగా పలువురు వక్తలు మద్దతు తెలిపి మాట్లాడారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి మాట్లాడుతూ పోరాడితే పోయేదేమీ లేదని, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఐక్యంగా పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. నాడు ప్రతిపక్ష నేతగా జగన్ తన పాదయాత్రలో కనిపించిన ప్రతిఒక్కరికీ ముద్దులు పెట్టారని, నాడు ఇచ్చిన హామీలను అమలు చేయాలని నేడు అడుగుతుంటే బెదిరించడం సిగ్గుచేటని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకానికి కేటాయించే మెనూఛార్జీ గిట్టుబాటు కాదన్నారు. పిఆర్‌సి అమలు చేస్తామని ప్రభుత్వ ఉద్యోగులను, పర్మినెంట్ చేస్తామని కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఈ ప్రభుత్వం ఘోరంగా మోసగించిందన్నారు. మాట తప్పి, మడమ తిప్పిన నేతగా జగన్మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా సలహాదారులను నియమించుకుని రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీల ఐక్యతను చూసి ప్రభుత్వం భయపడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక అంగన్వాడీలను వివిధ తనిఖీల పేర్లతో వేధించడం సిగ్గు చేటన్నారు. అంగన్వాడీలను అవమానించడానికే ఫుడ్ కమిషన్ ఛైర్మన్ అంగన్వాడీ కేంద్రాలను సందర్శిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వంలో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. పైగా రాజకీయ వేధింపులు తీవ్రంగా పెరిగాయన్నారు. తెలంగాణ రాష్ట్రం కంటే రూ.వెయ్యి అదనంగా జీతం ఇస్తానని నమ్మబలికి అంగన్వాడీలను నిలువునా మోసగించారన్నారు. కేవలం రూ.వెయ్యి జీతం పెంచి అంగన్వాడీల సంక్షేమానికి ఎసరు పెట్టారన్నారు. రైతాంగానికి వ్యతిరేకంగా కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలను తిప్పికొట్టడానికి రైతాంగం చేసిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎపి ఎన్‌జిఒల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పింఛన్‌తో కూడిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు, ఆంధ్రప్రదేశ్ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఈ ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు టి.మాణిక్యం, పి.హైమావతి, పిఎల్ఎస్.కుమారి, బిజెఎన్.కుమారి, తులసి, సరోజిని, రాజకుమారి, ఆదిలక్ష్మి, రజిని, జయసుధ, రామలక్ష్మి ఎస్.లత, పుష్ప, నాగవేణి, సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, ఎస్‌కె.సుభాషిణి, ఆర్‌విఎస్.నారాయణ, వి.సాయిబాబు, జె.గోపి, బి.జగన్నాధం పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్


విద్యార్థుల నుంచి వినతిని స్వీకరిస్తున్న పవన్‌కల్యాణ్

## ప్రతి సమస్య పరిష్కారానికి కృషి

### 'జనవాణి..జనసేన భరోసా'లో పవన్ కల్యాణ్ 24 అర్జీలు స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

ప్రతి సమస్య పరిష్కారానికి జనసేన కృషి చేస్తుందని, తన దృష్టికి వచ్చిన సమస్యకు తాను చేయగలిగిన సాయం చేస్తానని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బాధితులకు భరోసానిచ్చారు. వారాహి రెండోవిడత యాత్రలో భాగంగా తొలిరోజు ఏలూరులో బహిరంగ సభ నిర్వహించగా రెండోరోజు మంగళవారం మినీబైపాస్ రోడ్డులోని క్రాంతి కల్యాణ మండపంలో 'జనవాణి..జనసేన భరోసా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలకు సంబంధించి 24 వినతులు వచ్చాయి. బాధితుల బాధలను పవన్‌కల్యాణ్ ఓపిగ్గా విని సమాధానమిచ్చారు. ఏలూరు పట్టణ పరిధిలో ఫ్లాష్ స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరుపేదల అంతిమ సంస్కారాలకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని, శ్మశానంలో శాంతివనం పేరిట ఓ షెడ్డు ఏర్పాటు చేసుకుని వైకుంఠయాత్ర వాహనం, ఫ్రీజర్లు అక్కడ అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇటీవల ఓ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఎకు తమ సంస్థ తగిన గౌరవం ఇవ్వలేదనే నెపంతో నిరుపేదలకు ఉపయోగపడుతున్న శాంతివనాన్ని ధ్వంసం చేసి, ఫ్రీజర్లు బయటికి విసిరేశారని ఫ్లాష్‌సంస్థ సభ్యులు తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో శ్మశానంలో శవ దహనానికి రూ.ఐదు వేల రుసుము పెట్టారన్నారు. నిరుపేదలకు అండగా నిలుస్తున్న తమ సంస్థ సామగ్రి పెట్టుకోవడానికి స్థలం కేటాయించే ఏర్పాటు చేయాలని కోరారు. 16 ఏళ్లుగా ఆశా వర్కర్లుగా పని చేస్తున్నామని, 2018 తర్వాత ఫిక్స్‌డ్ వేతనమంటూ రూ.6.500 మాత్రమే ఇస్తున్నారని, కేంద్రం నుంచి వచ్చే రూ.3,500 సమాయానికి రావడం లేదని, కనీసం సెలవులు, మెటర్నిటీ లీవులు కూడా లేవని ఆశా వర్కర్లు ప్రమీల, విజయలక్ష్మి వాపోయారు. తమను సచివాలయాలకు అనుసంధానం చేయడంతో సమస్యలు పెరిగాయన్నారు. రవాణా శాఖలో పన్నులతోపాటు వాహన రిజిస్ట్రేషన్, లైసెన్సు కార్డులకు ఫీజులు చెల్లిస్తున్నా కార్డులు జారీ కావడం లేదని, గత 16 నెలల నుంచి లక్షల సంఖ్యలో కార్డులు పెండింగ్‌లో ఉన్నాయని, ఏలూరు జిల్లా పరిధిలో 50 వేల ఆర్‌సిలు, 30 వేల డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు జారీ చేయాల్సి ఉందని, ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని సుంకర ఈశ్వర్, చందు కోరారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు తమకు తరగతి గదులు లేకపోవడం వల్ల చెట్ల కింద, ఆరు బయటా చదువుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు వికలాంగులు తమ సమస్యలు విన్నవించారు. కార్యక్రమంలో పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, జనవాణి కోఆర్డినేటర్ డి.వరప్రసాద్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

### ప్రమాదకరంగా వాలంటీర్ల వ్యవస్థ

**ఏలూరు నియోజకవర్గ సమావేశంలో పవన్‌కల్యాణ్**

ఎవరేమనుకున్నా వాలంటీర్ వ్యవస్థ ప్రమాదకరంగా మారుతోందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. ఏలూరు నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో పవన్ మాట్లాడారు. గెలిచినప్పుడు కాదని, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఎలా ఉన్నామో చూడాలన్నారు. జనసేనకు బలమైన కేడర్ ఉంటేనే వైసిపికి బైబై చెప్పగలమన్నారు. ఏలూరులో డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఇంకా చెట్లకింద చదువుకోవడం బాధేస్తుందన్నారు. జనం మార్పు కోసం తహతహలాడుతున్నారన్నారు. వలంటీర్ల పొట్ట కొట్టాలన్న ఉద్దేశం తనకు లేదన్నారు. నెలకు రూ.5,200 జీతానికి యువతను గ్రామాల్లో కట్టిపడేస్తున్నారన్నారు. డిగ్రీ చదువుకుని ఆ జీతానికి పనిచేయడం చూస్తే నిరుద్యోగం ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు నాదెండ్ల మనోహర్, కొటికల పూడి గోవిందరావు, కనకరాజు సూరి, రెడ్డి అప్పలనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలు పారదర్శకంగా పరిష్కరించాలి

**ఏలూరు:** స్పందన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జెడ్‌పి సిఇఒ రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రభాస్కర్‌రెడ్డి, వ్యవసాయశాఖ జెడి రామకృష్ణ, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజుతో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాలు అందించాలన్నారు. అర్జీదారుణ్ని సంతృప్తిస్థాయిని పెంచేలా అధికారులు కృషిచేయాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, ఇళ్ల మంజూరు, పింఛన్లు, సర్వే, భూ వివాదాలు, మొత్తం 334 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

## ముగిసిన సర్టిఫికెట్ల పరిశీలన

**నూజివీడు రూరల్:** ఆర్‌జియుకెటి పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ఐఐఐటిల్లో ప్రవేశాలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. ఈ నెల 5వ తేదీ నుండి నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. ఈ నెల 13న ఐఐఐటిలకు ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తామని వైస్ ఛాన్సలర్ ఆచార్య కెసి.రెడ్డి తెలిపారు.

## జగన్ హామీలు మోసపూరితం : ముద్దరబోయిన

**చాట్రాయి:** పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో కుటుంబంలోని ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం కార్యక్రమాన్ని చంద్రబాబు అధికారంలోకి రాగానే అమలు చేస్తారని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. తుమ్మగూడెంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పాదయాత్ర చేస్తూ హామీ ఇచ్చిన జగన్ రెడ్డి తర్వాత ఒక కుటుంబానికి ఒక విద్యార్థికే అని 42 లక్షల మంది విద్యార్థులకు మొండిచేయి చూపి విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారని విమర్శించారు. రూ.లక్షల కోట్లు అప్పులు తెచ్చి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, ప్రజాధనాన్ని జగన్ రెడ్డి, తన అనుచరుల కంపెనీకి దోచిపెడుతున్నారని విమర్శించారు. చంద్రన్న అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకంలో ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు అందిస్తారన్నారు. అనంతరం వైసిపికి చెందిన వేముల కొండలరావు, తమ్మిశెట్టి మారేషు, తమ్మిశెట్టి రంగారావు, తమ్మిశెట్టి వెంకన్నతోపాటు మరో 20 మంది వైసిపీ కార్యకర్తలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు మరిడి చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు

**ఆగిరిపల్లి:** అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఎల్లప్పుడూ ప్రజల్లో గుర్తింపు ఉంటుందని యుటిఎఫ్ ఆగిరిపల్లి మండల ప్రధానకార్యదర్శి జె.జ్ఞానసుందరం అన్నారు. మండల పరిధిలోని అమ్మవారిగూడెం ఎంపిపి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పదేళ్ల పనిచేసి ఇటీవల బదిలీ అయిన కోకా జయలక్ష్మిని యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు అజరయ్య, కృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనీదేవి, ఉపాధ్యాయులు అపర్ణ, వంశీ విశిష్ట పాల్గొన్నారు.



విజయలక్ష్మి దంపతులకు సన్మానం

## వాలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి

### జిల్లావ్యాప్తంగా నిరసనలు - చింతలపూడిలో దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వాలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసి, వైసిపి ప్రభుత్వంపై నిరాధారమైన ఆరోపణలు చేసిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని మహిళా శిశు సంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయి బాల పద్మ అన్నారు. సోమవారం ఆమె వ్యక్తిగత కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పవన్ ఏలూరు పర్యటనలో ప్రభుత్వంపై చేసిన నిరాధారమైన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. మహిళల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత కల్పించి ప్రోత్సహిస్తుందన్నారు. చంద్రబాబుకు ఆటబొమ్మగా మారిన పవన్‌కల్యాణ్ నోటికి వచ్చిన ఆరోపణలు చేయడం తగదన్నారు. దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించడంలో కీలకపాత్ర వహిస్తున్న వాలంటీర్లను చులకన చేసి మాట్లాడటం నీచమని మండిపడ్డారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి అందిస్తున్న వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు సరికావని చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని లక్కవరంలో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎలిజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ తన చేతిలో మైక్ ఉందని నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. కేంద్ర నిఘావర్గాలు పవన్ ఒక్కడికే చెబుతాయా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఏది చెబితే అది మాట్లాడటం తప్ప మరొకటి తెలియదన్నారు.

**చింతలపూడి :** ఏలూరు బహిరంగ సభలో పవన్ కల్యాణ్ వాలంటీర్ల అనుచిత వ్యాఖ్యలు సరికావని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. కేంద్ర నిఘా వర్గాలు తనకు చెప్పాయని పేర్కొనడం కూడా సరికాదన్నారు. నిఘా వర్గాలు చెబితే ముఖ్యమంత్రికి చెబుతాయి తప్ప పవన్‌కు ఎందుకు చెబుతాయని ప్రశ్నించారు. అనంతరం పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

చింతలపూడిలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వాలంటీర్లు, నాయకులు

**నూజివీడు రూరల్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నూజివీడు పట్టణంలోని చిన్నగాంధీ బొమ్మ సెంటర్‌లో వాలంటీర్లు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, వైసిపి పట్టణ అధ్యక్షులు రాము, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముసునూరు:** పవన్ కల్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలు సరికావని, బాధాకరమని ఆయన తక్షణం వాలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వాలంటీర్ల మండల కన్వీనర్, జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, వైసిపి మండల నాయకులు కంభాల దాసు విమర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ వరకూ వాలంటీర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైసిపి నాయకులు తుల్లిమెల్లి రంగారావు పాల్గొన్నారు.

**పోలవరం :** వాలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు ఖండించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు అంటే స్వచ్ఛందంగా సేవ చేయడానికి వచ్చిన వారు అని, అలాంటి వారి పట్ల ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం పవన్‌కు తగదన్నారు. వాలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన పవన్ బేషరతుగా

## అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులలో బాధితులకు సత్వర న్యాయంతో పాటు, పరిహారం అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్సు కమిటీ సభ్యులు మేతర అజయ్ బాబు, గుగులోతు మోహన్‌రావు, లావేటి ప్రవల్లిక, డాక్టర్ రాంబాబు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్సు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కేసుల పరిష్కారంలో ఏలూరు జిల్లా రాష్ట్రంలో ముందు వరుసలో ఉందన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా బాధితులకు పరిహారం అందించడంలో జాప్యం జరిగిందని, అందుకు గల కారణాలు తెలుసుకుని, రాష్ట్రస్థాయి అధికారులతో సంప్రదించి బాధితులకు పరిహారం అందించడంలో కలెక్టర్ చొరవ చూపించారన్నారు. కేసుల పరిష్కారంలో సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేస్తున్నారని, కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో తీసుకున్న చర్యల కారణంగా బాధితులకు కొంతవరకు స్వాంతన చేకూరిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్సు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## దళిత భూముల ఆక్రమణను అడ్డుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దళిత కుటుంబాలకు జీవనాధారమైన భూమిని లాక్కునేందుకు భూస్వాములు చేస్తున్న కుట్రలను అధికారులు అడ్డుకోవాలని కోరుతూ నాగులగూడెం దళిత కుటుంబాల ప్రజలు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 11 దళిత కుటుంబాలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న నాలుగు ఏకరాల భూమిలో బైఠాయించి నిరసన తెలిపారు. అధికారుల, భూస్వాముల కుతంత్రాలు నశించాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగులగూడెం సర్వేనెంబర్ 508లో 5.60 ఎకరాల భూమి ఉందని నాలుగు ఏకరాల్లో 11 దళిత కుటుంబాలు తరతరాలుగా జీవనాధారం పొందుతున్నాయని తెలిపారు. గ్రామ సర్పంచి కొడుకు ప్రసాద్ రెడ్డి తమ కుటుంబాలపై కక్షగట్టి భూమిని ఆక్రమించేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఆయన చేస్తున్న అక్రమ మట్టి దందా కొనసాగించేందుకు పేదల భూమిపై కన్నేశారని ఆరోపించారు. ప్రభుత్వాధికారులు కూడా ఆయనకు కొమ్ముకాస్తూ పేదలపై కక్ష సాధింపు చేస్తున్నారని వాపోయారు. తాతల కాలం నుంచి ఈ భూమి సాగు చేసుకునేందుకు పన్నులు కూడా చెల్లిస్తున్నామన్నారు. అలాగే గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటులో కొందరు దళిత కుటుంబాలకు పరిహారం కూడా లభించిందన్నారు. అధికారులతో నోటీసులిప్పిస్తూ ఆ భూస్వామి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పదేపదే దౌర్జన్యం చేస్తూ చులకన భావంతో భయాందోళనకు గురిచేస్తున్న ప్రసాద్ రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కనికెల్లి జూలియమ్మ, కనికెల్లి ఇశ్రాయేలు, నిట్ట గంగరాజు, మోత్రపు మేరీ, పొద్దుటూరి లూర్ధమ్మ, లాగు జయమ్మ పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - పోలవరం

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు సూచించారు. ఎల్ఎన్‌డిపేటలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఐటిడిఎ పిఒ జివివి.సత్యనారాయణ, ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ బి.సుమతి, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి సభ్యులు కె.హేమకుమారి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ పాల్గొన్నారు.

**మండవల్లి :** సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేయడం సిఎం జగన్‌కే సాధ్యమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. కొవ్వాడలంక సచివాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాదయాత్రలో తెలుసుకుని అవినీతికి తావు లేకుండా అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు సచివాలయ వ్యవస్థను రూపొందించారన్నారు. అనంతరం అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచి జయమంగళ తిరుపతి వెంకన్న, ఉపసర్పంచి మోరు కృష్ణమోహన్ పాల్గొన్నారు.

**నూజివీడు రూరల్ :** పోతిరెడ్డిపల్లిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు రానివారికి అందించేందుకు ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు.

**జీలుగుమిల్లి :** జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ ఎం.ఝాన్సీరాణి సూచించారు. పాలచర్ల, రాజవరం పంచాయతీలోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు జరుగుతుందని మొత్తం 11 రకాల సేవలను ఉచితంగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో 540 ఇళ్ల సర్వేను వాలంటీర్లు పూర్తి చేశారన్నారు. ఈ సందర్భంగా వివిధ ధృవపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న 395 మందికి పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రైతు భరోసా కేంద్ర పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు, ఎంపిపి కె.పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, తహశీల్దార్ సుందర్‌సింగ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.


పోలవరంలో..

## జనాభా నియంత్రణకు సహకరించాలి

**ప్రజాశక్తి - ఏలూరు**

జనాభా నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం ప్రపంచ దినోత్సవం సందర్భంగా జనాభా నియంత్రణపై ముద్రించిన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశం అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే జనాభా నియంత్రణ అవసరమన్నారు. అధిక జనాభా ప్రభావం ఆ దేశ అభివృద్ధి, సహజవనరుల పంపిణీపై పడుతుందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వనరుల పంపిణీ జరగదన్నారు. అధిక జనాభా వలన కలిగే నష్టాలు, జనాభా నియంత్రణ ఆవశ్యకత, తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.ఆశ, డిఆర్‌డిఎ పిడి విజయరాజు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నాగరాణి, డిఎస్‌పి ఎ.ఎం.కృష్ణంరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై రూ.50కే కేజీ టమోటాలు

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

రైతు బజార్లో సోమవారం నుంచి కేజీ టమాటాలు రూ.50కే విక్రయిస్తామని ఎస్టేట్ అధికారి కొలుసు పుష్పవల్లి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బజార్లో ఉదయం 9 గంటల నుంచి ఒక వ్యక్తికి కేజీ టమాటాలు మాత్రమే ఇస్తామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు టమాటాలు కావాల్సిన వారు ఆధార్, రేషన్ కార్డులు తీసుకుని రైతు బజారులో కొనుగోలు చేయవచ్చునని పుష్పవల్లి తెలిపారు.

## తీవ్రమవుతున్న వీధి కుక్కల బెడద

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

రోజురోజుకీ వీధి కుక్కల బెడద పెరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కలను తరిమికొట్టాలని ఎన్నిసార్లు అధికారులకు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. కొత్తవారు రావాలన్నా, సంచుల్లో నిత్యావసరాలైన కూరగాయలు తేవాలన్నా కుక్కల గుంపు వెంబడిస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను, మున్సిపల్ కమిషనర్‌ను అభ్యర్థిస్తున్నారు.

## ఆయా పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ ఎస్‌వై.నూరానీ తెలిపారు. పట్టణంలోని కోనేరు పేట, యానాదుల కాలనీలలో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. స్థానిక వివాహిత మహిళా అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఐసిడిఎస్ నూజివీడు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఇతర వివరాల కోసం కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె తెలిపారు.

## సురక్షిత నీరు అందించడమే లక్ష్యం

**ప్రజాశక్తి - కలిదిండి**

గ్రామాల్లో స్వచ్ఛమైన కుళాయి నీరు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కైకలూరు నియోజక వర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చినతాడినాడలో రూ.48.43 లక్షలు, తాడినాడలో రూ.26.08 లక్షలతో జలజీవన్ మిషన్ గ్రాంట్ ద్వారా జరిగే పనులను ఆయన ప్రారంభించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపి కూనసంపూడి కనక దుర్గారాణి, సర్పంచి గండికోట ఏసుబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు సాగి చిన్నబ్బాయి రాజు, ఉప సర్పంచి యాళ్ల స్టీవెన్సన్, అల్లూరి సూర్యనారాయణ రాజు, పామర్తి సత్యన్నారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగబాబు పాల్గొన్నారు.

## అత్యవసర సేవల కోసం దరఖాస్తు చేసుకోండి

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో శాశ్వతలోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో సోమవారం న్యాయ సేవాధికార సంస్థ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాశ్వత లోక్ అదాలత్‌లో రవాణా, పోస్టల్, ఇన్సూరెన్స్, వైద్య, విద్య, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్, ఎన్ఆర్‌ఇజిఎస్, హౌసింగ్ రియల్ ఎస్టేట్, పారిశుధ్యం సేవలలో లోపం జరిగినప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఈ శాశ్వత లోక్ అదాలత్‌లో అన్ని సేవలు ఉచితంగా అందించబడునని, సంబంధిత అధికారులు ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, ఎన్ఆర్‌ఇజిఎస్, టెలికం, డిఎంఅండ్‌హెచ్‌ఒ, ఎపిఎస్ఆర్‌టిసి, సెంట్రల్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి

**భీమడోలు:** మండల పరిధిలో బడి బయట గల బడి ఈడు పిల్లలు అందరూ విధిగా పాఠశాలలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులు భాస్కర కుమార్, కె.శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో మండల పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారులు అమల్లో ఉన్న పలు పథకాలపై సమీక్షను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక అంచనాల మేరకు మండల పరిధిలో 215 మంది బడి ఈడు పిల్లలను గుర్తించామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సదరు పిల్లల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలు పాఠశాలలో చేరే విధంగా చైతన్య పరచాలన్నారు. బయోమెట్రిక్ ఆధారంగా పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. మండల పరిధిలోని 64 విద్యాసంస్థల్లో 11,697 మంది విద్యార్థులు నమోదయ్యారన్నారు. పూర్తి వివరాలను తమ కార్యాలయానికి అందజేయాలని హెచ్‌ఎంకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆగడాల లంక జిల్లా పరిషత్ ఓరియంట్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంవి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### నేరాలు - ఘోరాలు

## పెట్రోలు పడి మహిళకు గాయాలు

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

గొల్లపల్లి గ్రామంలో కొండ సీతమ్మ అనే మహిళ బడ్డీ కొట్టులో పెట్రోల్ విక్రయం చేస్తూ జీవిస్తుంది. సోమవారం మట్ట దావీదు ఆమె దగ్గర పెట్రోలు కొనుగోలు చేసి సిగరెట్టు వెలిగించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెట్రోల్ బాటిల్ కాలితో తన్నే ప్రయత్నం చేశాడు. పెట్రోలు పడి సీతమ్మపై మంటలు వ్యాప్తి చెందాయి. గాయాలు పాలైన సీతమ్మను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

ఎంఆర్ అప్పారావు కాలనీకి చెందిన బాల కిరణ్ కుమార్ కుటుంబ కలహాల నేపథ్యంలో సోమవారం ఎలుకల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. సమీపంలో ఉన్నవారు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా బాధితున్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరము మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి గేదెను తప్పించబోయి అదుపు తప్పి రహదారిపై పడ్డారు. తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని తాటిరామన్నగూడెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కరకం.వెంకటేష్ ఆదివారం సాయంత్రం దిబ్బగూడెం గ్రామంలో ఉంటున్న తన కూతురి దగ్గరకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మార్గ మధ్యలో గేదె అడ్డు రావడంతో ద్వి చక్ర వాహనం అదుపు తప్పి కింద పల్టీ కొట్టడంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రామలక్ష్మి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

# పిహెచ్‌సి సేవలను గర్భిణులు వినియోగించుకోవాలి

**ప్రజాశక్తి - భీమడోలు**

ఆరోగ్యకరమైన, సురక్షితమైన ప్రసవాల కోసం గర్భిణీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ప్రసాద్ కోరారు. నెలవారీ కార్యక్రమంలో భాగంగా స్థానిక పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మొదటి కాన్పు పరీక్షల కోసం కోసం వచ్చిన 21 మందికి, రెండు, మూడవ కాన్పుల పరీక్షల కోసం కోసం వచ్చిన 11 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 13 మందికి హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఇబ్బందులు ఉన్నట్టు గుర్తించారు. వీరిని ఈనెల 14వ తేదీన ఏలూరులోని ఆశ్రం వైద్యశాలకు వెళ్లేందుకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి, వివిధ పరీక్షలు అక్కడే చేసేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. అనంతరం పిహెచ్‌సి వైద్యులతో పాటు, ఎంపిహెచ్ ఇఒ శ్రీనివాసరావు, పిహెచ్‌సి హెల్త్ ఎడ్యుకేషన్ మల్లేశ్వరి, నవీన్ సంయుక్తంగా గర్భిణీలకు ఆరోగ్య పరిరక్షణ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి కాన్పు చేయించుకున్న వారికి ప్రభుత్వపరంగా ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన కార్యక్రమం కింద రూ.5,000 ప్రోత్సాహం అందుతోందన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం గర్భిణీలు సిపిలిసిస్, హెచ్ఐవి, టిబి వ్యాధుల నిర్ధారణ కోసం స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మొదటి కాన్పు తర్వాత మాతృత్వాన్ని కొనసాగించాలన్న ఆసక్తి గలవారు కాన్పుల మధ్య తగినంత వ్యవధి కోసం పిహెచ్‌సిలో అమర్చే ప్రత్యేక పరికరాల సేవలను వినియోగించుకోవాలని కోరారు. గర్భిణీలు తీసుకోవాల్సిన పోషకాహారం ఆవశ్యకతను తెలియజేశారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్నవారికి కౌన్సిలింగ్ నిర్వహించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న హెచ్‌ఎం

## మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలి

**ప్రజాశక్తి - ముసునూరు**

మధ్యాహ్నం భోజనం నాణ్యత ప్రకారం విద్యార్థులకు అందజేయాలని ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సునీల రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఉచిత మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భోజనంతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, షూస్, బ్యాగులు, దుస్తులు ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ఉన్నత చదువులు చదివిన, అర్హత కలిగిన ఉపాధ్యాయులతో మంచి బోధన అందిస్తున్నామని తెలిపారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి

**ప్రజాశక్తి - భీమడోలు**

ఫోటోగ్రాఫర్లు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా క్రియాత్మకంగా ఫోటోలను తీస్తూ అందరి మన్ననలు పొందాలని భీమడోలు ఏరియా ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు డి.శ్రీరామ్ తెలిపారు. సంఘం ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయిస్ డాగ్యురె 172వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు శ్రీరామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు లూయిస్ డాగ్యురె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సేవా కార్యక్రమాలను చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు పి.బ్రహ్మారావు, డి.డేవిడ్, ఉపాధ్యక్షులు ప్రభు, కోశాధికారి లీలాకృష్ణ పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం సభ్యులు

## పారిశుధ్య లోపంతో ప్రజల ఇబ్బందులు



ఎఒ శ్రీనివాసరావుకు అర్జీ సమర్పిస్తున్న సభ్యులు

**ప్రజాశక్తి - మండవల్లి**

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారి పారిశుధ్యం పూర్తిస్థాయిలో పడకేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు స్పష్టం చేశారు. మండల కేంద్రమైన మండవల్లిలో డ్రెయినేజీతో నెలకొన్న సమస్యలను పరిష్కారం కోరుతూ సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎఒ శ్రీనివాసరావుకు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా డ్రెయినేజీని ఇష్టానుసారంగా నిర్మాణం చేపట్టి, పూర్తి చేయకుండా వదిలేశారన్నారు. గత మూడు నెలల నుంచి పనులు చేయకుండా వదిలేయడంతో మురిగి పోయేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. వర్షపు నీరు కలిసి కైకలూరు సందు వేలముపేటలోని అంతర్గత రహదారుల పైకి మురుగు నీరు చేరుకుని దుర్గంధం వెదజల్లుతోందన్నారు. మురుగునీటిలో దోమలు వ్యాప్తి చెంది ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని ప్రజలు భయాందోళన చెందుతున్నారని వారు తెలిపారు. రామాలయం వద్ద ఎస్‌సి, బిసి కాలనీలలో అంతర్గత రహదారులు కొద్దిపాటి వర్షానికి జలమయం అవుతున్నాయి. గ్రామస్తులు వ్యాధుల బారిన పడకుండా పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు టి.అప్పారావు, బండి రంగారావు, డివి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో నిలిచిపోయిన వర్షపునీరు

## బస్టాండ్‌లోకి వర్షపు నీరు.. ప్రయాణికుల అవస్థలు

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణంలో వర్షపు నీరు నిలిచి ఉండటంతో ప్రయాణీకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరుగుదొడ్ల నుంచి వచ్చే వ్యర్థాలు వల్ల డ్రయినేజీ నిండిపోవడంతో, వర్షపు నీరు వెళ్లే మార్గం లేక చుట్టూ నిలిచిపోతున్నాయని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటకు రావాలన్నా, లోపలికి వెళ్లాలన్నా నీటిమడుగు లోంచి వెళ్లాల్సి వస్తుందని ప్రయాణీకులు వాపోతున్నారు. దీనిపై డిపో మేనేజర్ సత్వరమే చర్యలు చేపట్టి మరుగుదొడ్ల వద్ద బ్లీచింగ్ వేయించాలని, పూడికలు తీయించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

## వర్షం.. రోడ్లు బురదమయం..!

**అధ్వానంగా అంతర్గత రోడ్లు**
**ప్రమాదాల బారిన ప్రజలు**

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండలంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు, వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం కారణంగా గ్రామాల్లోని అంతర్గత, ప్రధాన రోడ్లు గుంతలుగా మారి బురదకయ్యలుగా తయారైయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. ఏరోడ్డు చూసిన గుంతలమయమై ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈరోడ్లపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. దీనికి వర్షం తోడు కావడంతో రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో నీరు చేరి రోడ్లు అధ్వానంగా, ప్రమాదకరంగా మారాయి. మండలంలోని గురజ ఇందిరమ్మ కాలనీ, ఎస్‌టి కాలనీల్లో అంతర్గత రోడ్లపై నీరు నిలిచిపోయి ాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇందిరమ్మకాలనీలో అంతర్గత రోడ్లు బురదమయంగా మారడంతో కాలనీవాసులు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. గురజలోని విఆర్ఒ కార్యాలయం సమీపంలో ముదినేపల్లి - గుడ్లవల్లేరు రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి గుంతల్లో వర్షపు నీరు చేరడంతో దారి కనబడక ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం ఈరోడ్డుపై పెద్దసంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు ప్రజలు, ప్రయాణీకులు పాలిట ప్రాణసంకటంగా తయారైయ్యాయి. వర్షంతో మండలంలోని పలు కాలనీల్లో, పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. వర్షంతో బేరాలు లేక చిరువ్యాపారులు, పనులు లేక కార్మికులు ఇబ్బంది పడ్డారు.

# 'జగనన్న సురక్ష' సేవలను వినియోగించుకోవాలి

భీమడోలు మండలంలో..

**ప్రజాశక్తి - భీమడోలు**

ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేకించిన జగనన్న సురక్ష కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు మండల పరిషత్ అధ్యక్షులు కనుమాల రామయ్య కోరారు. గుండుగొలను గ్రామ సచివాలయం-2 పరిధిలో జగనన్న సురక్షను సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండుగొలను గ్రామపంచాయతీ అభివృద్ధికి ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు పూర్తిస్థాయి సహాయ సహకారాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఆయన కృషి ఫలితంగా గ్రామపంచాయతీ పరిధిలో నివాస గృహాలు లేని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం రూ.కోట్ల వ్యయంతో 25 ఎకరాలు వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి, దానిని అభివృద్ధి పరిచి గృహ నిర్మాణాలకు సహకరిస్తున్నారని తెలిపారు. గుండు గొలను, దాని పరిసర ప్రాంతాలు ముఖ్యంగా కొల్లేరు ప్రాంత గ్రామాలతో పాటు ఆక్వా రంగం అభివృద్ధికి విద్యుత్ సమస్యల తీర్చేందుకు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. కొల్లేరు ముఖద్వారంగా గుర్తింపు పొందిన గుండుగొలను వంతెన శిథిలావస్థకు చేరి కూలిపోయిన నేపథ్యంలో గుండు గొలను, కొల్లేరు ప్రాంత గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. కార్యక్రమంలో భీమడోలు ఎంపిడిఒ సిహెచ్ పద్మావతిదేవి, తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, సొసైటీ అధ్యక్షులు ఆర్.సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

**చింతలపూడి:** నిరుపేదల కళ్లల్లో సంతోషం చూడడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అందుకోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను సిఎం జగన్ అమలు చేస్తున్నారని చింతలపూడి సచివాలయ కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనువాసరావు అన్నారు. ఊటసముద్రం పంచాయతీలోని గ్రామ సచివాలయం వద్ద సోమవారం 'జగనన్న సురక్ష'లో పాల్గొన్న ఆయన ప్రజలకు ధృవీకరణ పత్రాలను ఎంపిపి రాంబాబు జడ్‌పిటిసి మోలుగుమాటి నీరజసుధాకర్, సర్పంచి రాంబాబు, వైసిపి నాయకులు భరత్ రెడ్డితో కలిసి అందించారు. అనంతరం సర్పంచి రాంబాబు, వైసిపి నాయకులు భరత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ పేదవాడి కళ్లల్లో ఆనందాన్ని చూడడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు.

**ముదినేపల్లి:** ప్రజాసమస్యలు పరిష్కారానికే జగనన్న సురక్ష నిర్వహణని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పేరూరు గ్రామ సచివాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజాసమస్యలను గాలికి వదిలేశాయన్నారు. సిఎం జగన్ ప్రవేశపెట్టిన సురక్షతో ఎంతో మందికి న్యాయం జరుగుతోందన్నారు. ఈసందర్భంగా ప్రజల నుంచి సమస్యలు పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను అధికారులు స్వీకరించారు. పలువురుకి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను ఎంఎల్ఎ అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, మండల పార్టీ అధ్యక్షులు ఎం.ఏసుబాబు, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, గ్రామ సర్పంచి పుట్టి మాధవి, నాయకులు శీలం రామకృష్ణ, సొసైటి అధ్యక్షులు సోమసత్యనారాయణ పాల్గొన్నారు.



చింతలపూడి మండలంలో..

**ఆగిరిపల్లి:** జగనన్న సురక్ష ద్వారా అందించే పలు రకాల ఉచిత సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆగిరిపల్లి మండల తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు అన్నారు. నూగొండపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచి కందుల మల్లీశ్వరీ అధ్యక్షతన జగనన్న సురక్షను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 622 రకాల సర్టిఫికేట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.వెంకటరత్నం, ఎంపిడిఒ పి.శంకరరావు, జడ్‌పిటిసి పి.వీరబాబు, పంచాయతీ కార్యదర్శి పుల్లారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**టి.నరసాపురం :** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కరించబడతాయని జడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు తెలిపారు. కేతవరం గ్రామ సచివాలయలో సోమవారం సర్పంచి తడికలపూడి శివ మాధవి కిషోర్ కుమార్ అధ్యక్షతన జగనన్న సురక్షను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు పారదర్శకంగా లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి.సూర్యనారాయణ రెడ్డి, తహశీల్దార్ జెవి , ఎంపిడిఒ మంగాకుమారి పాల్గొన్నారు.

**ఉంగుటూరు:** రావులపర్రులో జగనన్న సురక్షను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలుచోట్ల నీడ, ఫల సాయాన్ని ఇచ్చే కొబ్బరి మొక్కలను ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, జడ్‌పిటిసి సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి నాటారు. అనంతరం ప్రజలకు ధృవపత్రాలు అందజేశారు. డిప్యూటీ తహశీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ ఆంజనేయులు, సర్పంచి పైడి వెంకటరమణ పాల్గొన్నారు.

**ముసునూరు:** రాష్ట్రాభివృద్ధిలో భాగంగా సిఎం జగన్ 'జగనన్న సురక్షను' ప్రవేశపెట్టారని జడ్‌పిటిసి వరికూటి ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయనలు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చక్కపల్లిలో జగనన్న సురక్షను ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

టి.నరసాపురం మండలంలో..

## 'టిడిపి బలోపేతానికి కృషి'

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

టిడిపి బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై టిడిపి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ముందుకు రావాలని కాపా శ్రీనివాసరావు కోరారు. ఎంఆర్ అప్పారావు కాలనీలో సోమవారం నిర్వహించిన టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొవాలన్నారు.

## లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

**ఉంగుటూరు:** టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర రెండువేల కిలోమీటర్లకు చేరిన నేపథ్యంలో సంఘీభావంగా ఉంగుటూరు నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు, ఉంగుటూరు ఇన్‌ఛార్జ్ వీరాంజనేయులు అన్నారు. సోమవారం రామచంద్రపురం, కాగుపాడు, అప్పారావుపేట క్లస్టర్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం కోసం తీసుకోవాల్సిన చర్యలపై కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

**నూజివీడు రూరల్:** పాదయాత్ర రెండువేల కిలోమీటర్లు పూర్తవుతున్న సందర్భంగా జరగనున్న సంఘీభావ యాత్రకు తరలి రావాలని నూజివీడు ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం నూజివీడులో ఆయన మాట్లాడుతూ రేపు ఉదయం తుక్కులూరులోని అడవి ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి నూజివీడు టౌన్ కోట మహిష్మ అమ్మవారి ఆలయం వరకూ జరిగే పాదయాత్రలో టిడిపి శ్రేణులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

**జంగారెడ్డిగూడెం:** పాదయాత్ర రెండువేల కిమీ పూరైన సందర్భంగా ఆపార్టీ నాయకులు సంఘీభావ యాత్ర నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు సాయిల సత్యనారాయణ తెలిపారు. సోమవారం చింతలపూడిలో తెలుగుయువత అధ్యక్షులు నత్తా నాగేంద్ర ఆధ్వర్యంలో గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ కృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చందర్ శేషు పాల్గొన్నారు.

**In The Court of Principal Junior Civil Judge, Tadepalligudem**
**O.S.No.76/2023**

Between
**UNION BANK OF INDIA, Tadepallidudm** — Plaintiff
**1. M/s Balaji Dresses**
Rep By Prop : Chappati Padmaja,
**2. Chappati Padmaja** — Defendents

**ప్రకటన**

యిందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై నంబరు గ్రంధములో శ్రీ కోర్టు వారు జారీ చేసిన సమన్లు త్రిప్పి పంపుచున్నందున పై నంబరు గ్రంధములో substitute seivice ద్వారా మీకు పేపరు ప్రకటన మూలముగా తెలియజేయునది. ఏమనగా పై నంబరు గ్రంధము ది.13.07.2023 తేదిన వాయిదా అయివున్నది. మీరు గాని మీ తరుపున ప్లీడరు గారి ద్వారా గాని ది.13.07.2023 తేదిన ఉదయం 10.30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావలసియున్నది. లేని యెడల మీ పరోక్షముగ తీర్మానించడం జరుగును. యీ ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.

ప్రతివాధుల అడ్రస్సు
**1. M/s Balaji Dresses**
Rep By Prop: Chappati Padmaja, W/o.Renukeswararao D.No.5-5-5,salipeta, rajuka Street, Tadepalligudem, W.G.dist
**2. Chappati Padmaja**
W/o.Renukeswararao,D.No.5-5-5,salipeta, rajuka Street, Tadepalligudem, W.G.dist

**MAVLN Acharyulu** ,Advocate
Tadepallligudem, Cell:99632 30864

**మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తణుకు**
**ఓ.యస్.నెం. 439/2020**

**బిట్వీన్:**
విజయా బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడ, Rep. by its Manager, తణుకు. ...వాది
**మరియు**
**1)** పజ్జూరి మోహనరాణి, భర్త: రమేష్, డో.నెం.19-5-11, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
**2)** పజ్జూరి వీరమణి, భర్త: శ్రీనివాసరావు, డో.నెం.19-5-11, బంగారు చెరువు గట్టు, పాలకొల్లు.
...ప్రతివాదులు

**ప్రకటన**

పై నెంబరు గ్రంధములో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికినిన్నీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **ది.20-07-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా కాని లేక మీయొక్క ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**O.N.KRISHNA**
Advocate, Tanuku.
Cell:98481 99440
తణుకు,
08-7-23.

**మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: తణుకు**
**ఓ.యస్.నెం. 610/2020**

**బిట్వీన్:**
విజయా బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడ, Rep. by its Manager, తణుకు. ...వాది
**మరియు**
**1)** వేముల హిమబిందు, తండ్రి: ప్రసాద్, డో.నెం.5-114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
**2)** వేముల సత్యవతి, భర్త: ప్రసాద్, డో.నెం.5-114, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
...ప్రతివాదులు

**ప్రకటన**

పై నెంబరు గ్రంధములో ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినప్పటికినిన్నీ అమలు జరుగనందున శ్రీ కోర్టు వారు పేపరు పబ్లికేషన్ ఆర్డరు వేసియున్నారు. సదరు గ్రంధము **ది.24-07-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది.** కావున మీరిద్దరు సదరు తేదీన శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షముగా కాని లేక మీయొక్క ప్లీడరు గారి ద్వారా కాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపవల్సినదిగా ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియచేయడమైనది. లేని ఎడల సదరు గ్రంధము మీ యొక్క పరోక్షములో తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

**O.N.KRISHNA**
Advocate, Tanuku.
Cell:98481 99440
తణుకు,
08-7-23.